నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 3 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## నాగోబా జాతర ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 2 : నాగోబా జాతర ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పరిశీలించారు. శుక్రవారం మండలంలోని నాగోబా ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో ఆమెను శాలువాతో సన్మానించారు. ఆలయం నుంచి గోవాడ్ వరకు పర్యటించారు. జాతర ఉత్సవాల తోపాటు సంస్కృతీ సంప్రదాయాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు శేఖర్ బాబు, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

నాగోబా జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

సభా వేదికపై రెండో వరుసలో కూర్చున్న గడ్డం బ్రదర్స్(వారి ముందే కూర్చున్న ప్రేమ్‌సాగర్ రావు)

## గడ్డం బ్రదర్స్‌ను పట్టించుకోలే..

- కాంగ్రెస్ తొలి సభలో దళిత ఎమ్మెల్యేలకు అవమానం
- రెండో వరుసకే పరిమితమైన ఇద్దరు అన్నదమ్ములు
- మరోసారి బయటపడ్డ కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలు

మంచిర్యాల, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నిర్వహించిన తొలి బహిరంగ సభలో ఉమ్మడి జిల్లాకు చెందిన దళిత ఎమ్మెల్యేలకు ఘోరమైన అవమానం జరిగింది. జిల్లాలో కీలక నేతలుగా ఉన్నప్పటికీ వారిని ఎవరూ పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఇద్దరు అన్నదమ్ములను సభలో దక్కాల్సిన ప్రాధాన్యం దక్కలేదు. సభా వేదికపై ముందు వరుసలో కాకుండా రెండో వరుసకే వారిని పరిమితం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కానప్పటికీ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ముందు వరుసలో అది మినిస్టర్ అని రాసి ఉంచిన కుర్చీలో కూర్చున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవీ అంటూ ఇస్తే అది పీఎస్ఆర్‌కే ఇస్తామనే సంకేతాలు ఇచ్చినట్లేనని ఆయన వర్గీయులు ప్రచారం మొదలు పెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో పీఎస్ఆర్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించి ఆయన్నీ అభినందించారు. కానీ.. వారి ప్రసంగంలో ఎమ్మెల్యేల హోదాలో ఉన్న గడ్డం వినోద్, గడ్డం వివేక్‌ల గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం.

## ప్రాజెక్టులు నిర్మిస్తాం.. సస్యశ్యామలం చేస్తాం

- ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటాం
- తెలంగాణ పునర్నిర్మాణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఇంద్రవెల్లి/ఉట్నూర్, ఫిబ్రవరి 2 : ప్రాజెక్టులు నిర్మించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.38.20 కోట్లతో చేపడుతున్న రోడ్లు, భవనాలు, అమరవీరుల స్మృతివనం పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావ్, కొండా సురేఖ, శాసన మండలి సభ్యులు వెంకటేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బోజ్జుపటేల్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనుమతితో కుష్టి, సదర్మాట్ ప్రాజెక్టులను నిర్మిస్తామని, కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఆ నాడు ఇంద్రవెల్లిలో ప్రతిజ్ఞ చేశామని, ఈనాడు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఆదివాసీల ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజన ఆవాసాలకు రూ. 27 కోట్లతో రహదారులు, వంతెనలు, రూ. 5 కోట్లతో నేరడిగోండ మండలం బుగ్గారాంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవనం, అమరవీరుల స్తూపం వద్ద రూ.కోటితో స్మృతి వనం నిర్మిస్తామన్నారు. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో రూ. 60 కోట్లతో నీటి శుద్ధి కేంద్రం పనులు చేపడుతున్నామన్నారు. అమరవీరుల 15 కుటుంబాలకు ముత్నూర్‌లో ఇంటి స్థలం, ఇండ్లు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు.

### మహిళలు ఆత్మగౌరవంతో బతకాలి

మహిళలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే తమ ధ్యేయమని సీఎం అన్నారు. నాగోబా దర్బార్ హాల్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. అనంతరం గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 1450 డ్వాక్రా సంఘాలకు సుమారు రూ.60 కోట్ల రుణాలు బ్యాంక్ లింకేజీ కింద పంపిణీ చేశారు. త్వరలో గ్యాస్ సిలిండర్లను త్వరలోనే రూ.500కే అందిస్తామని, 200ల యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. కెస్లాపూర్ నాగోబా ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.7 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్టాళ్లను పరిశీలించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్‌అలం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బుగుప్తా, అధికారులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : బహిరంగ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వేదికపై మంత్రులు, నాయకులు

# పేరుకే పునర్నిర్మాణ సభ

**గిరిజనుల కోసం ప్రత్యేక పథకాలు ఏం లేవు..**

- పాత కథే చెప్పి వెళ్లిపోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సీఎం హోదాలో ప్రసంగించకుండా విమర్శలకే ప్రాధాన్యం
- కేసీఆర్ సర్కార్ ఇచ్చిన స్టాఫ్ నర్సుల ఉద్యోగాలు
- కాంగ్రెస్ ఖాతాలో వేసుకునే ప్రయత్నం
- ఆశతో ఎదురుచూసిన జనానికి మిగిలింది నిరాశే..

ఇంద్రవెల్లి : ప్రజలు లేక వెలవెలబోతున్న బహిరంగ సభ

మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నిర్వహించిన తొలి సభ జనాలకు నిరాశే మిగిల్చింది. తెలంగాణ పునర్నిర్మాణ సభ పేరిట ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రెండు గ్యారెంటీల అమలును ప్రకటిస్తారని అంతా భావించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నుంచి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క నుంచి ప్రకటనలు కూడా వెలువడ్డాయి. దీంతో కాంగ్రెస్ నిర్వహించే మొట్టమొదటి సభపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆరు గ్యారెంటీలతోపాటు మరెన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక సీఎం తొలిసభ పెట్టడం, ఎంపీ ఎన్నికలకు శంఖారావం పూరిస్తారనే ప్రచారం జరగడంతో కచ్చితంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండింటినైనా అమలు చేస్తారనుకున్నారు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం త్వరలో రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభిస్తామని చెప్పి వదిలేశారు. ఆ రూ.500ల సిలిండర్ అమలు కూడా ప్రియాంకాగాంధీ రాష్ట్రానికి వచ్చి చేస్తారని చెప్పడంతో ఇప్పట్లో ఆ పథకం అమలులోకి వస్తుందా? రాదా? ఈ రెండు పథకాలకు సంబంధించి ఓ తేదీనైనా ప్రకటిస్తే బాగుండనే గుసుగుసలు వినిపించారు. తెలంగాణ పునర్నిర్మాణం అనే పేరుతో పెట్టిన సభలో రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం కోసం చేయాల్సిన పనులపై, అమలు చేసే కార్యక్రమాలపై స్పష్టత లేకుండా కేవలం విమర్శలకే సీఎం రేవంత్ ప్రాధాన్యం ఇచ్చారు. సీఎం హోదాలో ఆయన ప్రసంగం సాగలేదని, చాలా పేలవంగా ఉందనే టాక్ వినిపించింది. 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలను 15 రోజుల్లో భర్తీ చేస్తామని చెప్తూనే ఆయన కోర్టు కేసులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ప్రస్తావించడంతో ఇందులోనూ ఏదో మెలిక ఉందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

### ఆదివాసీ, గిరిజనులకు రిక్తహస్తాలే..

రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక తొలి సభను ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నిర్వహించారు. ఆ సెంటిమెంట్‌తోనే అధికారంలోకి వచ్చాక తొలి సభను ఇక్కడే నిర్వహించారు. దీంతో ఆదివాసీ గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లాలో వారి కోసం ప్రత్యేకంగా ఏదైనా పథకం ప్రకటిస్తారని అంతా అనుకున్నారు. కానీ.. తాగునీళ్లు, రోడ్లు, అభివృద్ధి పనులు చేస్తామని మాత్రమే సీఎం చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాను ప్రభుత్వం దత్తత తీసుకుంటుందని చెప్పారే తప్ప ప్రత్యేకంగా ఎలాంటి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేస్తామనే స్పష్టత ఇవ్వకపోవడంతో జనంలో గందరగోళం నెలకొంది. నీటి పారుదల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ.. వాటికి ఇచ్చే నిధులు, ఎప్పుడు పనులు ప్రారంభిస్తామనే అంశాలను ప్రస్తావించలేదు. కేసీఆర్ సర్కార్ ఉద్యోగాలు భర్తీ చేస్తే, రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో వారికి నియామక పత్రాలు ఇచ్చారనేది జగమెరిగిన సత్యం. అయినప్పటికీ రెండు లక్షల ఉద్యోగాల్లో ఏడు వేల స్టాఫ్‌నర్సుల ఉద్యోగాలు చేర్చిన సీఎం ఇంకా లక్షా తొంబైవేల పోస్టులు మాత్రమే భర్తీ చేయాల్సి ఉందంటూ సిగ్గులేకుండా ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు 317 జీవో ఉద్యోగుల విషయంలో స్పష్టత ఇవ్వాలని, పోడు భూములు పంపిణీ చేయాలని, ఐటీడీఏలో వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరినప్పటికీ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆ డిమాండ్లను అసలు పరిగణలోకే తీసుకోకపోవడం గమనార్హం.

### గంట ఆలస్యం.. జనం అసహనం..

సీఎం రేవంత్‌రెడ్డి సభ షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3.50కి మొదలుకావాల్సి ఉండగా.. సీఎం సభకు వచ్చే సరికి 4.50 అయ్యింది. సీఎంను చూసేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి వివిధ ప్రాంతాల నుంచి జనం రాక మధ్యాహ్నం 12 గంటల నుంచే మొదలైంది. ట్రాఫిక్ సమస్యతో పోలీసులు దూరంగా వాహనాలు నిలిపివేయగా కిలోమీటర్ల కొద్ది జనం నడుచుకుంటూ సభకు వచ్చారు. 2 గంటలకు సభకు జనం వచ్చేటప్పటికే ఎండ తీవ్రత పెరిగింది. సీఎం రాక ఆలస్యమవడం, దూరం నుంచి నడిచి రావడంతో జనం దాహంతో అల్లాడిపోయారు. నీటి సరఫరా లేక, సభ ప్రాంగణంలో నీడ లేక మండే ఎండలో మాడిపోయారు. రేవంత్‌రెడ్డి ఆలస్యంతో సభలో మిగిలిన నాయకులను మాట్లాడించారు. అలా ఒక్కో నాయకుడి ప్రసంగానికి ముందు, ప్రసంగం అయ్యాక జనం వాటర్, వాటర్ అంటూ గట్టిగా అరిచారు. వాటర్ లేదని తెప్పిస్తున్నామని నాయకులు చెప్పినప్పటికీ.. తాగునీరు అందలేదు. చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజలు సీఎం కోసం ఎదురు చూశారు. కొందరైతే దాహానికి తట్టుకోలేక బయటికి వెళ్లి మంచినీళ్లు తాగి వచ్చారు. ఒక ప్లానింగ్ లేకుండా హడావుడిగా సభ నిర్వహించి ఇబ్బందులు పెట్టడంపై జనం అసహనానికి గురయ్యారు.

సభలో ఎండకు తాళలేక ప్లెక్సీ కప్పుకున్న జనం

ఇంద్రవెల్లి : బహిరంగ సభలో నీళ్లు కావాలంటూ బాటిళ్లు చూపిస్తున్న యువకులు

## 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి

**సింగరేణి సీఎండీ బలరామ్**

జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఅండ్‌ఎండీ బలరాం, డైరెక్టర్లు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 2 : రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్ గరిష్ఠంగా ఉంటుందని, అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరిపడా బొగ్గు రవాణా చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ స్పష్టం చేశారు. శుక్రవారం సింగరేణి భవన్ నుంచి బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ బలరామ్ మాట్లాడుతూ దేశ ఇంధన అవసరాలకోసం 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి రవాణా చేయాలని అన్ని ఏరియాల జీఎంలకు దిశానిర్దేశం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సాధించాల్సిందేనని, మిగిలిన రెండు నెలల్లో 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, రవాణా చేయాల్సి ఉందని వివరించారు. ఇందుకు రోజుకు కనీసం 2.3 లక్షల టన్నులకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి చేయాలని, తద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చని, అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాలనుకున్న ఒడిశాలోని నైనీ, కొత్తగూడెంలోని వీకే కోల్‌మైన్, బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఓసీ, ఇల్లందు ఏరియాలోని జేకే ఓసీల ప్రారంభానికి కావాల్సిన అటవీ, పర్యావరణ అనుమతలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 19.80 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులను వీలైనంత త్వరగా ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించాల్సిన రామగుండం-3 ఏరియాలోని ఆర్జీకోల్‌మైన్, బెల్లంపల్లి ఏరియాలోని ఎంవీకే ఓసీకి సంబంధించిన అనుమతులకు ముమ్మరంగా ప్రయత్నించాలని అన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణ, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఈడీ జే అల్విన్, జీఎం కో ఆర్డినేషన్ సురేశ్, జక్కం రమేశ్, దేవెందర్, శ్రీరాంపూర్ నుంచి జీఎం సంజీవరెడ్డి, పీవోలు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సీవోఈ ఎంట్రెన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆర్సీవో కే.స్వరూపారాణి

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 2 : ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం ఈ నెల 4న నిర్వహించనున్న సీవోఈ ఎంట్రెన్స్ టెస్ట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి తెలిపారు. శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లి సీవోఈలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులుతో కలిసి ప్రవేశపరీక్షకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి 5918 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్‌టికెట్లు సంస్థ వెబ్‌సైట్ tsswreiajc.cgg.gov.in, www.tswreis.ac.in లో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు 3వ తేదీలోపు డౌన్‌లోడ్ చేసుకోని పరీక్షా కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని సూచించారు. ప్రవేశపరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 1723 మంది, ఆసిఫాబాద్ జిల్లాలో 1495, మంచిర్యాల జిల్లాలో 2700 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకులాలు ఆదిలాబాద్ బాలికల గురుకులం నుంచి 648,బోథ్ బాలికలు 648, ఇచ్చోడ బాలురు 255, ఆదిలాబాద్ మహిళా డిగ్రీ కళాశాల నుంచి 172 మంది, ఆసిఫాబాద్ బాలుర గురుకులం 528, సిర్పూర్ బాలికల గురుకులం 347, సిర్పూర్ బాలుర గురుకులం 347, రెబ్బెన బాలికల గురుకులం 273, బెల్లంపల్లి బాలుర గురుకులం (సీవోఈ) 504, బెల్లంపల్లి బాలికల గురుకులం 480, చెన్నూర్ బాలికల గురుకులం 550, లక్షెట్టిపేట బాలికల గురుకులం 480, జైపూర్ బాలుర గురుకులం 285, బెల్లంపల్లిలోని కాసిపేట బాలుర గురుకులం 401మంది విద్యార్థులు సీవోఈ ప్రవేశపరీక్షకు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. ఆర్సీవో వెంట బెల్లంపల్లి బాలికల, కాసిపేట గురుకులాల ప్రిన్సిపాళ్లు సందనరాజ స్వరూప, ఊటూరి సంతోష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, జేవీపీ పొన్నం శ్రీనివాస్, పరీక్షల ఇన్‌చార్జి వరమని ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి

## 'ఫొటో ఓటరు సవరణ' పకడ్బందీగా నిర్వహించాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు భారతి లక్పతి నాయక్

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 2 : ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు బీ. భారతి లక్పతి నాయక్ ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, బూత్ స్థాయి అధికారులు, బీఎల్‌వో సూపర్ వైజర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 6, 7, 8 ఫారాల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులేని 100 శాతం స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని సూచించారు. 18 ఏళ్లునిండిన వారితో పాటు అర్హత గల దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 6న పారామీటర్లు పరిశీలించి జాబితా రూపొందిస్తామని, 8న తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్ స్థాయి అధికారులు, ప్రతినిధుల సహకారం తీసుకుంటామన్నారు. సమావేశంలో నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు ఆశీష్ సంగ్వాన్, హేమంత్ బోర్కడే, బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు రాహుల్, శ్యామలాదేవి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ టౌన్ : మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకులు భారతి లక్పతి నాయక్

## వ్యవసాయ సాంకేతికత మరింత చేరువవ్వాలి

బెల్లంపల్లిరూరల్,ఫిబ్రవరి 2 : రైతులకు వ్యవసాయ సాంకేతికత మరింత చేరువవ్వాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పొలాస సహ వ్యవసాయ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ జీ.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన 7వ శాస్త్రీయ సలహామండలి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని కృషి విజ్ఞానకేంద్రాలు, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు గతేడాది చేపట్టిన పరిశోధనా అంశాలపై చర్చించి రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు కలసికట్టుగా పని చేస్తూ రైతులకు విలువైన వ్యవసాయ సూచనలు అందించగలగాలన్నారు. ప్రతి రైతును మేలు రకం పంటల సాగు వైపు నడిపించాలని సూచించారు. వచ్చేవాన కాలం, యాసంగిలో చేపట్టబోయే పరిశోధనా అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ సుధారణి జూమ్ మీటింగ్ ద్వారా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, రైతులనుద్దేశించి మాట్లాడారు. ప్రాంతాలకు అనుకూలంగా అభివృద్ధి చేసిన పరిశోధనా ఫలాలు ప్రతి రైతుకూ అందేలా ప్రణాళికాబద్ధంగా సాంకేతిక కార్యక్రమాలను రూపొందించాలన్నారు. బెల్లంపల్లి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కోట శివక్రిష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో వ్యవసాయ సాంకేతికతను రైతులకు మరింత చేరువ చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ (ఈఈఐ,హైదరాబాద్), ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాంప్రసాద్ (ఎంటమాలజీఅండ్ హెడ్ ఏ ఆర్ ఎస్ ఆదిలాబాద్), ప్రిన్సిపల్, సైంటిస్ట్ డాక్టర్ శ్రీలత(అగ్రోనామి), సైంటిస్ట్ డాక్టర్ శ్రీధర్ సిద్ధి(ఫాంట్ బ్లీడింగ్),డాక్టర్ గోన్యానాయక్ (ప్లాంట్ బీడింగ్),రియాక్ సభ్యులు సుంకర వెంకటేశ్వర్‌రావు,మంచిర్యాల,ఆసిఫాబాద్ జిల్లాల వ్యవసాయ అధికారులు కల్పన,కృష్ణారెడ్డి, మంచిర్యాల జిల్లా వెటర్నరీ అధికారి రమేశ్‌కుమార్, మంచిర్యాల జిల్లా మత్స్య అధికారి భవ్య, బెల్లంపల్లి కేవీకే శాస్త్రవేత్తలు, శాస్త్రీయ సలహా మండలి సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంచాలకుడు శ్రీనివాస్

## విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలి

- బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ బిటెన్ సింగ్

హాజీపూర్, ఫిబ్రవరి 2 : విపత్తులు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోనేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం (విజయవాడ) పదో బెటాలియన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ బిటెన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముంపు గ్రామమైన వేంపల్లిని పరిశీలించారు. అనంతరం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించి నీటి సామర్థ్యం.. తదితర వివరాలను ప్రాజెక్టు ఏఈఈ రాజ్‌కుమార్, సాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, రోడ్డు ప్రమాదాలు, వరదలవంటి విపత్తుల సమయంలో ఆస్తులు, ప్రాణనష్టం జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. అనంతరం ప్రాజెక్టులో చేపలు పట్టే మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గోవింద రావు, ఆర్ఐలు మంగ పాల్గొన్నారు.

మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న బెటాలియన్ బృందం సభ్యులు

నిర్మాణ దశలో ఉన్న ధోబీఘాట్

## కోర్టు స్టేతో నిలిచిన ధోబీఘాట్ నిర్మాణం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 2 : పట్టణంలో రూ. 2 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపడుతున్న ధోబీఘాట్ నిర్మాణం నిలిచిపోయింది. పట్టణంలోని ఒకటోవార్డు రాజీవ్‌నగర్ పరిధిలో 101 సర్వే నంబరులో 30 గుంటల భూమిని ధోబీఘాట్ నిర్మాణం కోసం అప్పటి కేసీఆర్ సర్కారు కేటాయించింది. ఇందుకు సంబంధించిన పనులను గతేడాది సెప్టెంబర్ 23న అప్పటి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు చకచకా సాగుతున్నాయి. పిల్లర్ల నిర్మాణం పూర్తయి బేస్‌మెంట్ దశకు చేరుకుంది. ఇటీవల ఈ భూమి తమదంటూ కొందరు కోర్టుకెళ్లడంతో స్టే లభించింది. కోర్టు స్టే ఉండడంతో నిర్మాణ పనులను ఆపేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

## 'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 2 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం జిల్లాలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీ